క్లుప్తంగా

అన్నసమారాధన


అన్న ప్రసాదం వడ్డిస్తున్న చందన నాగేశ్వర్


దోసాలమ్మ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా దోసాలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో గ్రామ ప్రజల తరపున అమ్మవారి గరగలకు పానుపు వేసి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు.

స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలి

ప్రకాశం నగర్: నిర్మాణం రంగంలో స్థానికులకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలని, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకురావడం వల్ల స్థానికులు ఉపాధి కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. స్థానిక బర్మా కాలనీలో ఆదివారం ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు తోకల ప్రసాద్ మాట్లాడుతూ బిల్డింగ్ మెటీరియల్ ధరలు పెరగడంతో పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వంగమూడి కొండలరావు, జట్లు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సునీల్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కిర్ల కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నర్సరీ రైతు ఆత్మహత్య

కడియం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన నర్సరీ రైతు ఏ.శ్రీగణేశ్ (30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన పన్నెండేళ్లుగా నర్సరీ వ్యాపారం చేస్తున్నాడు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హైదరాబాద్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు మొక్కలను సరఫరా చేసేవాడు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు ఇతనికి అరువుపై మొక్కలు ఇచ్చేవారు. కానీ ఇతర రాష్ట్రాల నుంచి డబ్బులు రాకపోవడంతో రైతులకు డబ్బులు చెల్లించేందుకు అప్పులు చేశారు. అవి తీర్చలేక మానసిక వేదనతో కలపు మందు తాగాడు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కడియం పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ

కడియం: మాతృవియోగంతో బాధపడుతున్న వరగోగుల సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మార్గాని సత్యనారాయణ, మచ్చేటి ప్రసాద్, సర్పంచ్ చక్కపల్లి మురళి ఉన్నారు.

పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

కడియం: మండల పరిధిలో యువత చెడుమార్గాల్లోకి వెళ్లకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని శాంతిభద్రతలపై సమీక్షించారు. నేరాలపై సరైన నియంత్రణ లేకపోవడం, మత్తు పదార్థాల వాడకం పెరుగుతోందన్నారు. మండల పరిధిలోని నేరాలు, వాటి నియంత్రణకు చేపట్టిన చర్యలపై ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్‌నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జనసేన స్థూపం ప్రారంభం

సీటీఆర్ఐ: జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు జన సైనికులు అడుగులు వేయాలని ఆ పార్టీ నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ అన్నారు. స్థానిక 46వ డివిజన్‌లో జనసేన స్థూపం ప్రారంభోత్సవానికి ఆయన ఆదివారం విచ్చేశారు.

కోడిపందేలపై దాడి

సీతానగరం: మండలంలోని సింగవరం శివారున కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. నిందితుల నుంచి రూ.1,760, రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

నేటి నుంచి సర్వే

బిక్కవోలు: మండలంలోని రెండు రోజుల పాటు సిటిజన్ సర్వే జరుగుతుందని ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు వలంటీర్ ద్వారా సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో సిబ్బంది తెలుసుకోవాలన్నారు. సోమ, మంగళవారాల్లో ఈ సర్వే పూర్తి చేయాలన్నారు.

నగరంలో ట్రాఫిక్ కష్టాలు

- పెరుగుతున్న వాహనాలు
- రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్
- రాకపోకలకు అవస్థలు

సీటీఆర్ఐ: నగరంలో రోజు రోజుకూ ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నాయి. అసలే ఇరుకు సందులు, దానికి తోడు కార్పొరేట్ హస్పటళ్లు, షాపింగ్ మాళ్లు విపరీతంగా ఏర్పాటు చేశారు. దానికి అనుగుణంగానే ట్రాఫిక్ రద్దీ కూడా ఎక్కువైంది. షాపింగ్ మాళ్లు, ఆస్పత్రులకు వచ్చిన వారు సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్డు పక్కనే వాహనాలను నిలిపివేస్తున్నారు. ముఖ్యంగా దానవాయిపేట, తిలక్ రోడ్డు, ప్రకాశం నగర్‌లో ప్రజలు ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాలలోని ప్రతి వీధిలో రెండేసి హాస్పిటళ్లు ఉండగా, మెయిన్ రోడ్డును ఆనుకుని వస్త్ర దుకాణాలు, ప్రైవేట్ బ్యాంకులు ఉన్నాయి. దానవాయిపేటలోని కర్రీ పాయింట్ల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంటోంది. నగరంలో కొందరు యువత తమ బైక్‌లకు సైలెన్సర్లు తీసివేసి, భారీ శబ్దాలతో రహదారులపై హల్‌చల్ చేస్తున్నారు. కంబాలచెరువు రోడ్డు, జైలు రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం రోడ్డులో ఈ పరిస్థితి ఉంది. వీరి నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల సామాన్యులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇతర వాహనచోదకులు భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రయాణం నరకం

దానవాయిపేట, ప్రకాశనగర్, తిలక్‌రోడ్డు వైపు ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. ఎక్కడబడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనితో ఈ ఏరియా వైపుగా ప్రయాణించాలంటే చాలా సమయం వృథా అవుతోంది. అలాగే నగరంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కోటగుమ్మం సెంటర్, మెయిన్ రోడ్డు, కంబాల చెరువు, గోకవరం బస్టాండ్, దానవాయిపేట ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేసి, పనులు చూసుకోవడానికి వెళుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు జఠిలమవుతున్నాయి. షాపింగ్ మాళ్లు, హాస్పిటళ్లు, రెస్టారెంట్లు వంటి వాటివద్ద సెల్లార్‌లో పార్కింగ్ సౌకర్యాలను కల్పించాలని వాహనచోదకులు కోరుతున్నారు. ప్రస్తుతం సెల్లార్లను షాపులుగా అద్దెకివ్వడం వల్ల వేరే దారిలేక రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారన్నారు.


దానవాయిపేట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్

చర్యలు తీసుకోవాలి



ఇష్టానుసారంగా, నిర్లక్ష్యంగా రోడ్లపై బైకులు నిలుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి. మహిళా కళాశాల, వీటీ కళాశాల రోడ్డులో కొందరు యువత బైక్‌లను నిర్లక్ష్యంగా నడుపుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– ఎం.విశాలాక్షి, తెలుగు లెక్చరర్, ఎస్‌కేఆర్‌డీఈడీ మహిళా కళాశాల

అంకితభావానికి చిరునామా కేశవభట్ల


శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న రైల్వే సిబ్బంది

- కొనియాడిన వక్తలు
- ఘనంగా ఉద్యోగ విరమణ సభ

సీటీఆర్ఐ: విధి నిర్వహణలో అంకిత భావం, సమాజంపై సేవాభావం కేశవభట్ల శ్రీనివాసరావును సమర్థవంతమైన అధికారిగా నిలబెట్టాయని సినీ నటుడు, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ కొనియాడారు. రైల్వే శాఖలో టికెట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాసరావును ఆదివారం రాత్రి రివర్‌బే ఫంక్షన్ హాల్లో ఘనంగా సత్కరించారు. ముందుగా రైల్వే స్టేషన్ నుంచి ఆయనను గజమాలతో సత్కరించి రివర్‌బే వరకూ భారీ ఊరేగింపుగా రైల్వే శాఖలకు చెందిన సిబ్బంది తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలే కాకుండా సమాజంపై బాధ్యతతో శ్రీనివాసరావు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన ఉద్యోగ విరమణ చేసినట్లు అనిపించడం లేదని, పూర్తి సమయం సమాజ సేవకు సిద్ధమైనట్టు తెలుస్తోందన్నారు. ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాసరావు అందించిన సేవలకు అనేక అవార్డులు దక్కాయన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ఎవరికీ సాయం కావాలన్నా ముందుకు వచ్చి సహాయపడే వ్యక్తి శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో చీఫ్ కమర్షియల్ మేనేజర్ జాన్ ప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపాల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ శివప్రసాద్, విశ్రాంత చీఫ్ కమర్షియల్ మేనేజర్ విజయ భాస్కర్, టికెట్ చెకింగ్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ కమిటీల నియామకానికి ఉత్తర్వులు

- క్రమశిక్షణ, విధేయతకు పట్టాభిషేకం
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి



సీటీఆర్ఐ: నగరంలోని పలు ప్రముఖ దేవాలయాలకు పాలక వర్గాలను (కమిటీలు) నియమించేందుకు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మాదేపల్లి విజయరాజు ఉత్తర్వులు జారీ చేసినట్టు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీకి విధేయత, క్రమశిక్షణతో ఉన్నవారిని గుర్తించి ఆయా ఆలయ కమిటీలలో నియమిస్తామన్నారు. పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం, గౌతమీ జీవకారుణ్య సంఘం, చందా చౌల్ట్రీ, ఉమా మార్కండేయశ్వరస్వామి దేవాలయం, ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవాలయం, సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలక మండళ్లను వచ్చేవారం రోజుల్లోగా నియమించబోతున్నట్టు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్లు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ సంయుక్తంగా ఈ దేవస్థాన కమిటీలకు సరైన వారిని ఎంపిక చేస్తారన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం


స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ వరహాలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మదుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన ఫిబ్రవరి 2వ తేదీ వరకూ 21వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ధ్వజారోహణ జరిగింది. సాయంత్రం తిరువీధి (గరుడ సేవ) ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఊరేగింపు ప్రారంభించారు. అవసరాల కిరణ స్వామి, ముప్పిరాల అనంతాచార్యులు, పరాశర రఘునాథ భట్టర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయం నుంచి కంబాల చెరువు, దేవీచౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, సాయికృష్ణ, ఊర్వశి సెంటర్, జాంపేట మీదుగా ఊరేగింపు సాగి ఆలయానికి చేరుకుంది. దారి పొడవునా భక్తులుక్త స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం హోమాలు, సాయంత్రం తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


దుళ్ల హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కడియం: దుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సుమారు 38 ఏళ్ల తర్వాత ఆదివారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ప్రకాశం నగర్: కందుకూరి వీరేశలింగం ఆస్తికోన్నత పాఠశాల 1977 – 78 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సెంట్రల్ జైలు సమీపంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాలతో సహా పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నాటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ముంగార సత్యనారాయణ, మోహన్ గాంధీ, పూడి భాస్కర్ రామ్, భాస్కర్, పి.శ్రీనివాస్, అజయ్, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వకంగా..

సీటీఆర్ఐ: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం రాజమహేంద్రవరం నగరంలోని పలు వివాహ శుభ కార్యక్రమాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా మంజీరా కన్వెన్షన్ హాలులో ఆయనను ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. రెవెన్యూ, రీసర్వేకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.


మంత్రి ధర్మాన ప్రసాదరావుతో చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్ రామ్, జేసీ తేజ్ భరత్


మంత్రి ప్రసాదరావును సత్కరిస్తున్న షర్మిలారెడ్డి

కోటపాడులో 144 సెక్షన్

రంగంపేట: కోటపాడులో ఆదివారం నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు 144 సెక్షన్ విధించినట్టు తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. ఆ గ్రామంలో స్థల వివాదం నేపథ్యంలో ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు ఆధ్వర్యంలో ఇరువర్గాలతో చర్చలు నిర్వహించారు. అవి సఫలం కావడంతో సోమవారం శివుని విగ్రహం ఏర్పాటు చేసుకోవడానికి పోలీసు, రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో సోమవారం శివుని విగ్రహం ఏర్పాటు చేయడానికి గ్రామస్తులు ఏర్పాట్లు ప్రారంభించారు.

ఇందులో భాగంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని ఆదివారం రాజమహేంద్రవరం డీఎస్పీ భక్తవత్సలం, అనపర్తి సీఐ శ్రీనివాస్ పరిశీలించారు.

ఎంపీ భరత్‌రామ్ కృషి అభినందనీయం


బైబిల్ మిషన్ సభలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

సీటీఆర్ఐ: స్థానిక క్వారీ మార్కెట్ సమీపంలోని శానిటోరియమ్ స్వస్థతశాలలో జరిగిన బైబిల్ మిషన్ 85వ మహా సభలలో ఆదివారం ఎంపీ భరత్ రామ్‌ను క్రైస్తవులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎస్.విజయరాజు మాట్లాడుతూ క్రైస్తవుల శ్మశాన వాటిక కోసం ఆరెకరాలను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయడంలో ఎంపీ భరత్ చేసిన కృషి అభినందనీయమన్నారు. గతంలో ఈ సమస్య ఎవ్వరూ పెద్దగా పట్టించుకోలేదని, ఎంపీ భరత్ రామ్‌కు విన్నవించగా వెంటనే పట్టుదలతో సాధించారన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ క్రైస్తవులకు శ్మశాన వాటిక లేకపోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇందుకోసం కలెక్టరేట్ సమీపంలో ఆరెకరాలను ప్రభుత్వ ధర ప్రకారం రూ.30 కోట్లకు కొనుగోలు చేసినట్టు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అందరూ చోదోడుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, కాంతారామ్ పాటిల్, పాలా సాయి, మార్గాని బుజ్జి, సుందర్ సింగ్ పాల్గొన్నారు.

నేడు ‘హరితా యువత’ కార్యక్రమం

రాజమహేంద్రవరంలో ఎంపీ మార్గాని భరత్ రామ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే హరితా యువత కార్యక్రమంలో నగర వాసులందరూ పాల్గొనాలని ప్రముఖ సినీ కథానాయిక ఈషా చావ్లా పిలుపునిచ్చారు. నందం గనిరాజు జంక్షన్ వద్ద సోమవారం ఉదయం 9.30 గంటలకు పెద్ద ఎత్తున యువత, విద్యార్థులతో గో గ్రీన్ చాలెంజ్ నినాదంతో ఎంపీ భరత్ సారథ్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఈషా చావ్లాతో పాటు అనేక మంది ప్రముఖులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కదలిరండి యువతా, నేనూ మీరూ మనమంతా కలిసి నగరంలో మొక్కలు నాటుదాం, పచ్చని సుందర నగరంగా తీర్చిదిద్దామని పిలుపునిచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి (30) ఆదివారం మృతి చెందాడు. అతడు గోకవరం వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి పురుషోత్తపట్నం వెళ్లే బస్సు ఎక్కాడు. అతను గోకవరం బస్టాండ్ వద్ద దిగి బస్సు మారాల్సివుంది. అయితే మారకుండా అదే బస్సులో ఉండిపోవడంతో కండక్టర్ ప్రశ్నించాడు. దీంతో అతను విషయం చెప్పాడు. బస్సు వేరే ప్రాంతానికి వెళ్తుందని కండక్టర్ చెప్పి అతడిని దింపేశాడు. ఆ తర్వాత అతనికి మూర్ఛ వచ్చి పడిపోయాడు. స్థానికులు వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడు రంపచోడవరానికి చెందిన సిద్దూ అని, ఇటుకబట్టీలో చేస్తుంటాడని సమాచారం.

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద..

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని మహిళ (50) ఆదివారం మృతి చెందింది. కాంప్లెక్స్ వద్ద నున్న వాటర్‌ట్యాంక్ వద్ద ఆమె పడి ఉండడాన్ని కొందరు గమనించి, ప్రకాశం నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

ఒకటిన వీరేశ్వరస్వామి కల్యాణం

మధురపూడి: బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఫిబ్రవరి ఒకటిన నిర్వహించనున్నట్టు ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారన్నారు.

పోటెత్తిన భక్తులు

పెదపూడి: జి.మామిడాడలోని ఉషా, ఛాయ, పద్మిని, సంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామి దర్శనానికి మాఘమాసం రెండో ఆదివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో స్వామికి పూజలు చేశారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం


పనులను సమీక్షిస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: మండల కేంద్రమైన కడియం నుంచి దుళ్ల వరకూ, కడియం – జేగురుపాడు మొత్తం 21 కిలోమీటర్ల పరిధిలో ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. సుమారు రూ.40 లక్షలతో చేపట్టిన ఈ పనులను కడియంలో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా చూడాలని సిబ్బంది ఆదేశించారు. ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు, ఎంపీటీసీ సుధాకర్, పార్టీ నాయకులు బాబులు, ఓగిరాల రాజు, ఆరేటి వెంకట్రావు, గుత్తుల వాసు, మణి, కొత్తూరి బాల నాగేశ్వరరావు, చింతపల్లి రామకృష్ణ, తులసీరామ్, మూర్తి పాల్గొన్నారు.

వైభవంగా మాచరమ్మ జాతర


మాచరమ్మ గద్దె


ఆలయంలో పూజలు నిర్వహించి, సమర్పించిన అమ్మవారి గద్దెలు

అనపర్తి: పొలమూరు శివారు చిన పొలమూరు గ్రామ దేవత మాచరమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఏటా మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే ఆదివారం రాత్రి అమ్మవారి జాతర, సోమవారం తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి ఆలయంలోని గద్దె పీఠను కిందకుదించడంతో జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి గద్దె పీఠను శిరస్సును ధరించిన భక్తులు పొలమూరు పాకలతో పాటు పొలమూరులో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు సైతం అమ్మవారి ప్రతిరూపం, విభూది పండు, వివిధ రకాల పుష్పాలు, అరటి పండ్లు ఉంచిన పళ్లేలను శిరస్సున ధరించి గద్దె పీఠను అనుసరించారు. జాతర సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సోమవారం అమ్మవారి తీర్థం జరుగుతుంది.

రేపు ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలక వర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించనుంది. నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం స్థానిక విలేకరులకు తెలియజేశారు. ఆ రోజు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్‌గా సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా అడబాల వెంకటేశ్వరరావుతో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేస్తారు. మధ్యాహ్నం 1.30కు స్థానిక గంగిరెడ్డి నర్సింగ్ హోమ్ నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీగా బయలుదేరి అనపర్తి, పొలమూరు మీదుగా సాయంత్రం 4 గంటలకు మండలంలోని రామవరం చేరుకుంటారు. అక్కడ రూ.1.75 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన ప్రారంభోత్సవం, అనంతరం రామవరంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం అభినందన సభ నిర్వహిస్తారు. ఈ సభకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కాకినాడ రూరల్, నిడదవోలు, కాకినాడ టౌన్, కొత్తపేట, గోపాలపురం ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జి.శ్రీనివాస్ నాయుడు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, తలారి వెంకట్రావు, శాసన మండలి సభ్యులు తోట త్రిమూర్తులు హాజరవుతారు.

సినిమాలు

శ్యామల	వారసుడు
సూర్యమినీ	మాలికపురం
సూర్యప్యాలెస్	పఠాన్
స్వామి	వాల్తేరు వీరయ్య
శివజ్యోతి	వాల్తేరు వీరయ్య
అనుశ్రీ	హంట్
రాజా	పఠాన్
కుమారి	ధమాకా
ఊర్వశి	పఠాన్
రంభ	సిందూరం
మేనక	తెగింపు
గీతాఅప్సర	వాల్తేరు వీరయ్య
నామవరం	
వీఎస్ మహల్	వాల్తేరు వీరయ్య
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	వాల్తేరు వీరయ్య
కడియం	
వెంకటసూర్య	వాల్తేరు వీరయ్య